www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 3 ఆగస్టు 2024



'అమరరాజా'లో స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు

ప్రజాశక్తి - రేణిగుంట

కరకంబాడి అమరరాజా విద్యాలయంలో స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. ప్రధానోపాధ్యాయురాలు గ్లోరి దేవప్రియ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందితే దేశంపట్ల, సమాజం పట్ల బాధ్యతాయుతంగా మెలుగుతారని అన్నారు. ఎన్నికల నిర్వహణ, ఓటు హక్కు వినియోగం పట్ల విద్యార్థులకు అవగాహన వస్తే పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటవుతుందన్నారు.

ఊరూ వాడ.. కమ్ముకొస్తున్న క్యాన్సర్



మహిళల్లో రొమ్ము క్యాన్సర్ అధికం

- ప్రభుత్వ సర్వేల్లోనే 60 వేలమంది గుర్తింపు
- పింక్‌బస్ పరీక్షల్లో 10 శాతం మందికి నిర్ధారణ
- 15 నుంచి ప్రయోగాత్మకంగా పైలెట్ ప్రాజెక్టు
- ఉమ్మడి జిల్లాలో లక్ష మందికి పైగా బాధితులు

ఊరూ..వాడా..క్యాన్సర్ కమ్ముకొస్తోంది. ఈ మహమ్మారి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చాపకింద నీరులా వ్యాపిస్తోంది. ఇటీవల నిర్వహించిన ప్రభుత్వ సర్వేల్లోనే అధికారికంగా దాదాపు 60 వేల మందికి పైగా అనుమానిత లక్షణాలు ఉన్నట్లు బహిర్గతమైంది. ఈ సంఖ్య వాస్తవంగా లక్షపైనే ఉన్నట్లు ఎన్‌జిఓ సంఘాలు ప్రకటిస్తున్నాయి. దీనికి తోడు తిరుపతిలోని స్విమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పింక్‌బస్ స్క్రీనింగ్‌లో 8 వేల మందికి పరీక్షలు చేస్తే వారిలో 10 శాతం మందికి వ్యాధి నిర్ధారణ కావడం జిల్లాలో కలకలం రేపుతోంది. ఈ వ్యాధి తీవ్రతను గుర్తించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్ అధికారులతో ఇటీవలే సమీక్ష నిర్వహించారు. ఈనెల 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆ రోజు నుంచే క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం ప్రత్యేకంగా జిల్లా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం గమనార్హం. పురుషుల్లో 12 శాతం వస్తుండగా, మహిళల్లో 88 శాతం బయట పడుతోంది. మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు ఎక్కువగా పొంచి ఉంటున్నాయి.

ప్రజాశక్తి- తిరుపతి

క్యాన్సర్ ....అనే పదం వింటే చాలు ఒక రకమైన భయాందోళన. ఆ వ్యాధి సోకిందంటే ఇక ప్రాణాలు పోవడం ఖాయం అనే భావన. ఇది ప్రాణాలు తీసే అత్యంత ప్రమాదకరమైన వ్యాధి అని చాలా మంది భావిస్తుంటారు. కానీ, 1970 కాలం నుంచి ఈ వ్యాధి బారిన పడిన వారు కోలుకుంటున్న రేటు ప్రస్తుతం మూడింతలు పెరిగింది. ప్రారంభంలోనే ఈ వ్యాధిని గుర్తించడమే దీనికి కారణం. వాస్తవంగా చాలా రకాల క్యాన్సర్లు తీవ్రంగా ముదరకముందే గుర్తించి చికిత్సను తీసుకోవడం ద్వారా రోగులు ప్రాణాలతో బయటపడుతున్నారు. భారత్‌లో 7శాతం మరణాలు క్యాన్సర్‌తోనే సంభవిస్తున్నాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుర్తించిందని, వాటిలో మన ఆంధ్రప్రదేశ్ దేశంలో మూడో స్థానంలో ఉండటం, అందులోనూ ఉమ్మడి చిత్తూరు జిల్లా రెండో స్థానంలో ఉండటం తీవ్ర కలకలం రేపుతోంది. తిరుపతిలోని స్విమ్స్‌కు వస్తున్న అనుమానిత రోగుల్లో 40 శాతంకు పైగా నిర్ధారణ అవుతుండటం గమనార్హం.

నిర్ధారణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు

డాక్టర్ ఎం జయచంద్రారెడ్డి, స్విమ్స్ బయో ప్రత్యేకాధికారి

ప్రభుత్వం, స్విమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ (బయో) ద్వారా జిల్లాలోని వివిధ పిహెచ్‌సిల పరిధిలో నిర్వహిస్తున్న పింక్ బస్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నాం. అనుమానిత లక్షణాలు ఉన్న మహిళలు, పురుషులను ఎంఎల్‌హెచ్‌పిలు షెడ్యూలు ప్రకారం పింక్ బస్సు వద్దకు తీసుకు రావాలి. నిర్ధారణ అయిన వారికి స్విమ్స్ ద్వారా మెరుగైన చికిత్సలను అందించేందుకు ప్రభుత్వం, స్విమ్స్ యాజమాన్యాలు సంయుక్తంగా చర్యలు తీసుకుంటోంది. క్యాన్సర్ సోకిందనే భయం వద్దు..మొదట్లో గుర్తిస్తే చికిత్స చాలా సులభం. అనవసర ఆందోళనతో ప్రాణాంతక జబ్బుకు బలికావొద్దు.

తహశీల్దార్లా...మజాకా..!



కోరుకున్నచోటికి లక్షల్లో నజరానా
రూ.కోటి పలికిన తిరుపతి రూరల్
ఉమ్మడి జిల్లాలో బదిలీల జాతర

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రభుత్వం మారింది.. విధానాలు మారలేదు.. ప్రజాప్రతినిధుల చేతులు తడుపుకోవడం మానలేదు.. బాగా ఆదాయం ఉన్న 'రెవెన్యూ' శాఖలో తహశీల్దార్లు డబ్బులిచ్చి మరీ పోస్టింగ్‌లు వేయించుకున్నట్లు సమాచారం. ఒక్క చిత్తూరు జిల్లాలో 32 మంది తహశీల్దార్లకు పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గతంలో వీళ్లు ఎన్నికలకు ముందు ఇదే జిల్లాలో పనిచేస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డిప్యుటేషన్‌పై అనంతపురం, కడప, అన్నమయ్య, కర్నూలు జిల్లాలకు బదిలీపై వెళ్లారు. నూతన ప్రభుత్వం అధికారం చేపట్టింది. కలెక్టర్ల నుంచి ఆర్డీవోలు, తహశీల్దార్లు వరకూ సాధారణ బదిలీలు జరుగుతూ ఉన్నాయి. అందులో భాగంగానే చిత్తూరు జిల్లాలో 32 మంది తహశీల్దార్లుకు పోస్టింగ్ ఇచ్చారు. రేపోమాపో తిరుపతి తహశీల్దార్లు 32 మందికి ఆర్డర్లు రానున్నాయి.

శుక్రవారం బదిలీ అయిన 32 మందిలో దాదాపు ఏడుగురికి అధికార పార్టీ ఎంఎల్‌ఎలు అడిగినంత నజరానా చెల్లించకపోవడంతో మారుమూల మండలాలకు బదిలీ చేశారని చర్చ నడుస్తోంది. పాలసముద్రం, నింద్ర, విజయపురం తదితర మండలాల్లో డబ్బులిచ్చుకోలేని వారు బదిలీపై వెళ్లారు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాల్లోనూ ఆయా స్థానిక ప్రజాప్రతినిధులు బదిలీలను 'క్యాష్' చేసుకున్నారని చర్చ నడుస్తోంది. రెవెన్యూ ఆదాయం బాగా ఉండే మండలాల్లో 20-30 లక్షల ధర పోస్టింగ్‌కు పలికింది. రెవెన్యూ తక్కువగా ఉండి, భూముల విలువ తక్కువగా ఉండేచోట 10-15 లక్షలు ఇవ్వాల్సి వచ్చింది. తిరుపతి జిల్లా రాష్ట్రంలోనే ఖరీదైన జిల్లా. తిరుపతి రూరల్, అర్బన్, చంద్రగిరి, రేణిగుంట, రామచంద్రాపురం, సత్యవేడు, పుత్తూరు, వడమాలపేట, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, కోట, వాకాడు, గూడూరు, ఏర్పేడు, శ్రీకాళహస్తి రూరల్, తొట్టంబేడు, వరదయ్యపాళెం, పిచ్చాటూరు మండలాల్లో తహశీల్దార్లు చీటీపాట పాడినట్లుగా పాడుకున్నారు. ఒక్క తిరుపతి రూరల్ ప్రాంతమే కోటి ధర పలికినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. సంబంధిత నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఎంత డిమాండ్ చేస్తే అంత ఇచ్చుకున్నట్లు సమాచారం. చంద్రగిరి, రేణిగుంట, రామచంద్రాపురం, ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాలు రూ.30 లక్షలు సమర్పించుకున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే పోస్టింగ్స్ ఇస్తారని చర్చ నడిపిన వారం రోజుల్లోనే ఈ డీల్ కుదిరినట్లు తెలుస్తోంది. సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాలకు తక్కువ 'ధర' పలికినట్లు సమాచారం.

ప్రణాళికాబద్ధంగా గృహనిర్మాణ పురోగతి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం పేదవారికి ఇళ్లు కల్పించే సమున్నత సంకల్పంతో ఉన్నదని, ఆ దిశగా గహ నిర్మాణ శాఖ 100 రోజుల లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికా బద్ధంగా రోజువారీ స్టేజి కన్వర్షన్ పురోగతిపై సమీక్షించుకుని సకాలంలో లక్ష్యాలను సాధించాలని, అలసత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు గహ నిర్మాణ శాఖ పై జిల్లా కలెక్టర్ జెసి శుభం బన్సల్ తో కలిసి సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గహ నిర్మాణ శాఖ వంద రోజులకు లక్ష్యాలు నిర్దేశించుకున్న మేరకు రోజువారీగా 36,618 స్టేజి కన్వర్షన్ల పురోగతి సాధించేలా పనితీరు ఉండాలని సూచించారు. ప్రారంభం కానివి, పునాది నుండి గోడల స్థాయికి, గోడల స్థాయికి వచ్చిన వాటిని పై కప్పు స్థాయికి ఇలా 28931 ఇల్లు, పూర్తి స్థాయి రూఫ్ క్యాస్ట్ స్థాయికి 7687 స్టేజి కన్వర్షన్ పురోగతి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గహ నిర్మాణ శాఖ పథక సంచాలకులు వెంకటేశ్వర్ రావు, ఈఈ లు మోహన్ రావు, శేషగిరి, డిఈ లు శ్రీనివాస రావు, జహీర్, దాశయ్య, సత్యనారాయణ, షబ్బీర్ పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జెసి శుభం బన్సల్, కమిషనర్ నారపురెడ్డి మౌర్య, డిఆర్ఓ పెంచల కిషోర్‌లతో కలిసి ఆగస్టు 15న నిర్వహించనున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. తిరుపతి పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే కార్యక్రమ ఏర్పాట్లను ఆర్డీవో చేయాలని సూచించారు. సీటింగ్ ఏర్పాట్లు అర్బన్ తహశీల్దార్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ డిఇఓ చూడాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి వసతి కమిషనర్ బాధ్యతన్నారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రసంగిస్తున్న కందారపు మురళి

నూతన ప్రభుత్వం విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి పాలనలో నిర్బంధాలు తప్ప, సమస్యల పరిష్కారానికి నోచుకోలేదన్నారు. వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల విస్తృత సమావేశం జరిగింది. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నారాయణ అధ్యక్షత వహించారు. కందారపు మురళి మాట్లాడుతూ సమాజంలో ధరలు పెరిగినంత వేగంగా ఆదాయాలు పెరగడం లేదన్నారు. చిరుద్యోగుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో 83 రోజులు పాటు కంటిన్యూగా పోరాడి వాచ్ మెన్లు షిఫ్ట్ ఆపరేటర్లుగా పదోన్నతి పొందారని, హైకోర్టు ఆదేశం ఇచ్చిన నేటికీ షిఫ్ట్ ఆపరేటర్ల వేతనాలు రాకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం మారిందని, విధానాలు మారితేనే 'మార్పు' జరిగినట్లవుతుందన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, స్టోర్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆరోగ్యదాస్ పాల్గొన్నారు.



జనసేనలోకి సాని అనంత్

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి మండలం వెలంపాడు గ్రామం నుండి వైసీపీ నాయకులు సాని అనంత్ తన అనుచరులు 20 మందితో జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా సమక్షంలో శ్రీకాళహస్తి పట్టణం లోని పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ లో చేరారు. పార్టీలో చేరిన వారికి వినుత కోటా కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.

అనుమతి లేని ల్యాబ్‌లపై దాడులు

ప్రజాశక్తి -రేణిగుంట

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యు. శ్రీ హరి ఆధ్వర్యంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఛత్రప్రకాష్ రెడ్డి తన సిబ్బందితో కలిసి రేణిగుంటలో ఉన్న ప్రైవేట్ ల్యాబ్ లను పరిశీలించారు. అనుమతులు లేని రోగనిర్ధాణ చేసే ల్యాబ్ లను గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేసి సీజ్ చేశారు. మొత్తం తొమ్మిదింటిలో ఎలాంటి అనుమతులు లేని ఎనిమిది ల్యాబ్ లను గుర్తించినట్లు తెలిపారు. వారందరికీ షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు నాగరాజు, కామరాజు, ఎమ్ఎల్హెచ్పీ లు శోభ, పద్మ, ఎఎన్ఎమ్ లు లోహిత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మంగళం పరిధిలోని పలు అనుమతి లేని మెడికల్ ల్యాబ్‌లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి రావు ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రభుత్వ అనుమతి లేని, రిజిస్ట్రేషన్ లేని మెడికల్ ల్యాబ్ లను సీజ్ చేశారు. శుక్రవారం మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు జయంతి, స్రవంతి, ఎంపీహెచ్ఈఓ మురళి, పిహెచ్ఎన్ తాష్ కెంట్ నోడల్ బందం తనిఖీలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరిరావు పాల్గొని రికార్డులను పరిశీలించారు. సప్తగిరి కాలనీలో మంజునాథ్ క్లినికల్ ల్యాబ్, హమ్సిక డయాగ్నస్టిక్స్ లాబ్, బిటిఆర్ కాలనీలోని హేమ క్లినికల్ ల్యాబ్, మంగళం క్వార్టర్స్ కరకంబాడీ ప్రధాన మార్గంలోని ఇంటర్నేషనల్ స్పెషాలిటీ మెడికేర్ సెంటర్ లోని ల్యాబ్ లను వైద్యాధికారులు సీజ్ చేశారు.

బళ్లారి రాఘవకు నివాళి

తిరుపతి సిటి : తెలుగు నాటక రంగ కీర్తిని ప్రపంచ దేశాలలో వెలిగేత్తి చాటిన నటుడు దర్శకుడు బళ్లారి రాఘవ అని రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి కొనియాడారు. బళ్లారి రాఘవ జయంతి పురస్కరించుకుని తిరుపతి రాయలసీమ రంగస్థలం కార్యాలయంలో బళ్లారి రాఘవ చిత్రపటానికి కళాకారులు పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా గూండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ బళ్లారి రాఘవ 12వ యేటనే నాటక రంగంలోకి అడుగుపెట్టి అంచలంచెలుగా ఎదుగుతూ షేక్స్పియర్ రచించిన అనేక నాటకాలను తెలుగులో రచించి ప్రదర్శించి మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహనీయుల చేత ప్రశంసలు పొందారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెఎన్ రాజా , సుబ్రహ్మణ్యం యాదవ్, శంభోలాహరినాథ్, కాస్ప పద్మనాభం, సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

'డ్రై' డేతో వ్యాధులు దూరం : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రతి శుక్రవారం డ్రై డే ను పాటించడం ద్వారా విష జ్వరాలు, వ్యాదులు ప్రబలకుండా ఉంటాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 1 నుండి జూలై 31 వ తేదీ వరకు 'స్టాప్ డయేరియా' కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం గిరిపురంలో నిర్వహిస్తున్న డ్రై కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత, ఫ్రైడే డ్రై డే ద్వారా వ్యాదులు ఎలా అరికట్టవచ్చని ప్రజలకు కమిషనర్ అవగాహన కల్పించారు. ప్రతి రోజూ కాచిన నీరు తాగడం మంచిది అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్స్ చెంచయ్య పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం పరిశీలన

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గొల్లవానిగుంట వద్ద ఏర్పాటు చేస్తున్న క్రికెట్ స్టేడియంలో అన్ని పనులు పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని నాలుగు ప్రాంతాల్లో పున్హ ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్న అన్నా క్యాంటీన్లలో జరుగుతున్న పనులను శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. కచ్చపి ఆడిటోరియంలో కళాకారులు తమ ప్రదర్శనలు ఇచ్చేందుకు వీలుగా, అందుబాటులో ఉండేలా ధరలు నిర్ణయించి, నిర్వహణ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ మోహన్, స్మార్ట్ సిటి జనరల్ మేనేజర్ చంద్రమౌళి ఉన్నారు.

హెల్త్ బడ్జెట్ నిధులు పెంచండి : ఎంపి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

కేంద్ర బడ్జెట్‌లో వైద్యానికి నిధులు పెంచాలని ఎంపి ఎం.గురుమూర్తి కోరారు. మంగళగిరి ఎయిమ్స్‌కు తగినన్ని నిధులు ఇవ్వాలని, స్విమ్స్‌ను జాతీయ ప్రాముఖ్యత కలిగిన వైద్య సంస్థగా గుర్తించాలన్నారు. శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీకి జాతీయ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ హోదా కల్పించాలన్నారు. పార్లమెంట్‌లో హెల్త్ బడ్జెట్‌పై తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి పై ప్రతిపాదలను పెట్టారు. ప్రధానమంత్రి స్వస్థ సురక్ష యోజన పథకానికి నిధుల కేటాయింపులు తగ్గించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. 2022-23 సంవత్సర బడ్జెట్ రూ.7517 కోట్లు ఉంటే, ఈ సంవత్సరం బడ్జెట్ కేటాయింపు రూ.2200 కోట్లు మాత్రమే ఉందని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు.

సుప్రీం తీర్పు అనాలోచిత నిర్ణయం : చింతామోహన్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అనాలోచిత నిర్ణయమని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. చిత్తూరు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా దేశ సమగ్రతను దెబ్బతీసేలా సుప్రీం తీర్పు ఉందన్నారు. మూతబడిన ఎస్సీ కార్పొరేషన్లను టిడిపి కూటమి వెంటనే తెరిపించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో దళిత అధికారులను నియమించకపోవడం బాధాకరమన్నారు. తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వం దళిత అధికారులకు పెద్దపీట వేస్తోందన్నారు.

'శ్రీ మారుతి'లో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - తిరుపతి సిటి



శ్రీ మారుతి హాస్పిటల్స్‌లో అతి క్లిష్టమైన బ్రాన్కో ఆర్ ట్రే ఎంప్లాయిజేషన్ శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మారుతి కష్ణ తెలిపారు. వివరాల్లోకెళ్తే 65 సంవత్సరాల వయసుగల మహిళ దగ్గుతో రక్తస్రావం అవుతూ శ్రీ మారుతి హాస్పిటల్ ఎమర్జెన్సీ విభాగానికి వచ్చారు. వెంటనే ఇంటర్నేషనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎంపీ నరసింహ ఆమెను పరీక్షించి ఎమర్జెన్సీ బ్రాంకోస్కోపీ చేసి ఊపిరితిత్తుల్లో ఎడమ భాగం నందు రక్తస్రావం అధికంగా ఉండడంతో బ్రాంకో ఎంబోలైజేషన్ అనే అడ్వాన్స్ పద్ధతిలో రక్తస్రావాన్ని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఆపరేషన్ కోత లేకుండా కార్డియాలజిస్ట్ డాక్టర్ పి చంద్రశేఖర్ రెడ్డి,రేడియోలజిస్ట్ నవీన్ పర్యవేక్షణలో విజయవంతంగా పూర్తిచేసినట్లు తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలకు పరిమితమైన బ్రాన్కో ఆర్ ట్రే ఎంప్లాయిజేషన్ శస్త్ర చికిత్స ఇప్పుడు మన తిరుపతి మారుతి హాస్పిటల్ లో అందుబాటులో ఉందన్నారు.

దివ్యానుభూతి కల్పించేలా తిరుమల యాత్ర

'కాల్ యువర్ ఈవో'లో శ్యామలరావు వెల్లడి

ప్రజాశక్తి - తిరుమల

అక్టోబర్ 4-12 తేదీల్లో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని టిటిడి ఈవో జె.శ్యామలరావు వెల్లడించారు. శ్రీవారి లడ్డు నాణ్యతను, రుచిని మరింత పెంచుతామన్నారు. అందరి సమన్వయంతో తిరుమల యాత్రను భక్తులకు దివ్యానుభూతి కల్పించేలా కృషి చేస్తున్నామన్నారు. తిరుమల అన్నమయ్య భవనంల శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అక్టోబర్‌లో జరగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఏర్పాట్లను సెప్టెంబర్ చివరికల్లా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15-17 తేదీల్లో శ్రీవారి పవిత్రోత్సవాలు 14న అంకురార్పణతో ప్రారంభమవుతాయన్నారు. ఆగస్టు 1 నుంచి పుష్కరిణిని మూసివేసి పైపులైన్ల మరమ్మతులు, సివిల్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. శ్రీవారి భక్తుల సౌకర్యార్థం జులై 22 నుంచి ఆఫ్‌లైన్‌లో రోజుకు వెయ్యి శ్రీవాణి దర్శనం టికెట్లు కేటాయించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా తిరుమలలో తాగునీరు, అన్నప్రసాదాలు, ముడిసరుకులను ఎప్పటికప్పుడు పరిక్షించేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆధ్వర్యంలో అత్యాధునిక ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. క్యూలైన్లలో నిరంతరాయంగా అన్నప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. తిరుమలలో దళారుల ఏరివేతకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. టీటీడీ ఐటి వ్యవస్థను మరింత బలోపేతం చేసి ఆర్జిత సేవలు, దర్శనం, వసతి తదితర సేవల బుకింగ్‌లో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాం. గతంలో వారానికి 1.05 లక్షలు ఇస్తున్న ఎస్ఎస్‌డి టోకెన్లను, భక్తులు క్యూలైన్లలో వేచి ఉండే సమయం తగ్గించేందుకు ప్రస్తుతం 1.47 లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. వీటిని మరికొంత పెంచేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఇవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీఈఓ ఎస్ వి బి సి షణ్ముఖ్ కుమార్, సి ఈ నాగేశ్వరరావు, సిపిఆర్ఓ డాక్టర్ టి.రవి, పాల్గొన్నారు.


తిరుమల హోటళ్లలో ఈవో తనిఖీలు

తిరుమలలో తనిఖీలు

టిటిడి ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఇఓ గౌతమితో కలిసి శుక్రవారం తిరుమలలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. టిటిడి భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అన్నమయ్య భవనంలోని ఏపిటిడిసి నడుపుతున్న హొటల్‌ని, పిఎసి-2, మాధవ నిలయాన్ని పరిశీలించి, నిర్మాణంలో ఉన్న కొత్త పిఎసి - 5నితనిఖీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఉండేలా నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఎస్వీ మ్యూజియంను ఆధునీకరిస్తున్న టిసిఎస్ బందంతో కలిసి సందర్శించి పనుల పురోగతిని పర్యవేక్షించారు.

డయేరియాపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడు కండ్రిగ, కంచన పుత్తూరు గ్రామ పంచాయతీలలో డయేరియా నివారణ, డ్రై డే గురించి ప్రజలకు అవగాహన వైద్యాధికారులు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి ఇందిరా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో దయేరియా, ఇతర జ్వరాలు రాకుండా వుండాలంటే క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలని, నీటిని కాచి చల్లార్చి తాగాలని, తాజా ఆహారం, వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, చేతులు శుభ్రం చేసుకోవడం, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే డయేరియాను నిర్మూలించవచ్చునని తెలిపారు. డయేరియా బారిన పడిన వారు ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంల వద్ద, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో లభించే ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఒక లీటరు నీటిలో కలిపి కొద్ది కొద్దిగా తాగడం ద్వారా ప్రాణాపాయ స్థితి నుండి బయటపడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, , మహిళా పోలీస్ కాంచన, ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

గ్రామ సేవకుల సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న విఆర్‌ఏలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గ్రామ సేవకుల న్యాయమైన డిమాండ్లపై అసెంబ్లీలో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ హామీ ఇచ్చారు. గూడూరు గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ భవనంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సేవకులు ఎమ్మెల్యే సునీల్ కుమార్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో గ్రామ సేవకులు అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, వారు తెలిపిన సమస్యలు అసెంబ్లీలో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ గ్రామ అధికారుల సంఘం అధ్యక్షులు రమణయ్య, విఆర్ఏ జిల్లా కార్యదర్శి కొల్లపూడి సుబ్బయ్య, సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: అన్నదాత సుఖీభవ పథకం గురించి కెవిబిపురం మండలంలోని రైతులందరికీ శుక్రవారం అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ మండల రైతులు ఖచ్చితంగా ఈ పంట నమోదు చేసుకోవాలని దాని ద్వారా రైతులకు చాలా మేలు జరుగుతుందని, భవిష్యత్తులో ఈ పంట నమోదు చేసుకున్న వాళ్లకే వ్యవసాయ రుణాలు మంజురాతాయని అందుకు మండలంలో ఉన్న రైతులందరూ పంట చేసుకోవాలని ఆయన రైతులకు సూచనలు అందజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ర్యాలీ

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: తల్లిపాలు వారోత్సవాలను పురస్కరించుకొని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తల్లిపాలు ప్రాముఖ్యతపై పలు నాగలాపురం మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. తల్లి పాల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపరువైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, సావిత్రి, హెల్పర్ కామాక్షి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కోట : తల్లి పాలతో ప్రతి బిడ్డకు మేధస్సు అభివృద్ధి చెందుతుందని అంగన్‌వాడీ ప్రాజెక్ట్ సిడిపిఓ మునికుమారి అన్నారు. కోట మండలంలోని గూడలి పంచాయతీ దక్షిణ పాలెం,చెందోడు పంచాయతీ లోని ఎన్టీఆర్ కాలనీ, ఏడబ్ల్యూ డబ్ల్యూ కాలనీ, నెల్లూరు పల్లి కొత్తపాలెంలలో నిర్వహిస్తున్న తల్లి పాల వారోత్సవాలను సీడీపీఓ మునికుమారి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఐసీడీఎస్ సూపరువైజర్లు కవిత, కృష్ణమ్మ, అంగన్‌వాడీ టీచర్లు కోమది, భారతి, రూపాలత, రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సహాయకులు తల్లులు పాల్గొన్నారు.

క్యాంపస్ :శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఆగస్టు రెండవ తేదీన 'తల్లిపాల వారోత్సవాలు' సందర్భంగా హోం సైన్స్ విభాగం, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ప్రిన్సిపల్ డాక్టర్.టి. నారాయణమ్మ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు శ్రేష్టమని, వాటి ప్రాముఖ్యతను, పోషక విలువల గురించి అందరూ తెలుసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జి.భద్రమణి, హోమ్ సైన్స్ అధ్యాపకులు జి నాగమణి, జి శ్రీవాణి, కె చెంచులక్ష్మి, జి వాణిప్రశాంతి, ఎం ఉమారాణి, హోం సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి -దొరవారిసత్రం : ప్రతి విద్యార్థి విద్యతోపాటు, న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పి పి) ప్రకృతి కుమార్ విద్యార్థులకు సూచించారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని నెలబల్లి యుపి పాఠశాలలో అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో అటవీ అధికారుల పర్యవేక్షణలో మొక్కలు నాటి, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ రమణయ్య, డిఆర్ఓ కోటేశ్వరరావు, ఫారెస్ట్ అధికారులు శ్రీనివాసులు, ధనలక్ష్మి, పాఠశాల హెచ్ఎం, రామయ్య, మాజీ సర్పంచి గోని జకరయ్య, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా తిరుమలరెడ్డి పుట్టినరోజు వేడుకలు

తిరుమలరెడ్డికి కేక్ తినిపిస్తున్న నాని

ప్రజాశక్తి -రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండల టిడిపి అధ్యక్షుడు తిరుమలరెడ్డి పుట్టినరోజు వేడుకలు రాయల చెరువులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఎం తిరుమలరెడ్డి రాయలచెరువు గ్రామంలోని నివాసంలో కేక్ కట్ చేసి దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలలో మేకల మాధవ, పసుపు లేటి విజయ కుమార్, మాజాను మాధవయ్య, సి జనార్ధన్ చౌదరి, బి ధనంజ యులు, పూజారి సుబ్రమణ్యం యాదవ్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మురుగు నీటి వ్యవస్థ మెరుగుకు చర్యలు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణ వ్యాప్తంగా ప్రధాన మురుగునీటి వ్యవస్థను మెరుగు పరిచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ఆదేశించారు. ఎమ్మెల్యే శుక్రవారం పట్టణంలోని ఓటేరు కాలువను పరిశీలించారు. రూ.58 లక్షల ప్రత్యేక నిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గానికి కేటాయించారని తెలిపారు. వర్షాకాలం లోపు అన్ని కాలువల్లో పూడికతీత పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐ రెడ్డినాయక్‌కు నివాళి

తిరుపతి సిటీ : విధినిర్వహణలో ఉండగా ఆకస్మికంగా మృతిచెందిన ట్రాఫిక్ ఎస్ఐ రెడ్డినాయక్‌కు ఎస్‌పి సుబ్బరాయుడు నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. రుయాలోని ఎస్ఐ భౌతిక దేహానికి గౌరవ వందనం చేశారు. ఎస్ఐ కుటుంబానికి పోలీసు శాఖ అన్నివిధాలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. శుక్రవారం యథావిధిగా విధి నిర్వహణకు వచ్చిన రెడ్డినాయక్ ఆకస్మికంగా గుండెపోటు రావడంతో సిబ్బంది హుటాహుటిన రుయాకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెడ్డినాయక్ స్వస్థలం అన్నమయ్య జిల్లా కెవిపల్లి మండలం జిల్లెళ్ల మందలోని పెద్దతాండ గ్రామం. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కులశేఖర్ శాంతి భద్రతలు, డి.ఎస్.పి రామకష్ణ చారి తిరుపతి ట్రాఫిక్, సీఐ చిన్న పెద్దయ్య ట్రాఫిక్, పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో ముగిసిన 'కెరీర్ కిక్ స్టార్టప్'

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్, స్టూడెంట్ అఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో లింక్డ్ ఇన్ కెరీర్ కిక్ స్టార్టప్ కార్యక్రమం శుక్రవారం సావేరి అతిథి గృహంలో ఘనంగా ముగిసింది. ఐ క్యు ఏసి డైరెక్టర్ ఆచార్య త్రిపుర సుందరి స్టూడెంట్స్ ఆఫ్ డీన్ ఆచార్య కాత్యాయని మాట్లాడుతూ విద్యార్థులందరూ లింక్డ్ ఇన్ ప్రొఫైల్ ను క్రియేట్ చేసుకుని డిజిటల్ ద్వారా వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

- ఆర్‌డిఓ కిరణ్ కుమార్

అధికారులతో చర్చిస్తున్న ఆర్‌డిఓ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని ఆర్‌డిఓ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గూడూరు ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం అమలుపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమే అని ఆడపిల్లల పట్ల వివక్ష తగదని తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంను కఠినంగా అమలు చేయడం ద్వారా భ్రూణ హత్యలను నివారించవచ్చన్నారు. జిల్లాలో ప్రతి నెల అన్ని స్కానింగ్ కేంద్రాలను డాక్టర్లు తనిఖీ చేయాలని, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడుతున్న స్కానింగ్ సెంటర్లు, వారి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని సూచించారు. స్కానింగ్ సెంటర్లో రిజిస్ట్రేషన్, రెన్యువల్ , ఇతర మెడికేషన్ దరఖాస్తులను ఆన్లైన్ మాత్రమే స్వీకరిస్తామని తెలిపారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ మార్గాలన్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారి అనుమతి తప్పనిసరి అన్నారు. ఈ చట్టాన్ని అతిక్రమించిన వారికి రూ.50వేల జరిమానా 3 సంవత్సరాల కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మస్తానమ్మ , డివిజనల్ పరిపాలన అధికారి శిరీష, డెమో బాబు నెల్లూరు రెడ్డి , డిప్యూటీ సివిల్ సర్జన్ సంపూర్ణ , సివిల్ అసిస్టెంట్ సర్జన్ బి గిరిజ, సిడిపిఓ మెహబూబ్, గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనర్థం

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ అధికారులు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందని, ఆనర్థదాయకం కలిగించే వీటిని వెంటనే అరికట్టాలని కేవీబీపురం మండలంలోని ఓల్లూరు ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుమతి, కల్యాణ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిపిటి మండల కోఆర్డినేటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట విరుద్ధమన్నారు. 18 ఏళ్ల లోపు వివాహం చేసుకున్న బాలికలు గృహహింస ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. పైగా కౌమార దశలో గర్భవతి కావడం వల్ల ప్రసవ సమయంలో సమస్యలు ఎదురు కావడంతో పాటు ఆరోగ్యకరమైన బిడ్డ జన్మిం చే అవకాశం లేదని, దీర్ఘకాలిక ప్రతికూల పరిణామాలు వచ్చే ప్రమాదముందన్నారు. దీని వల్ల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపు తుంద న్నారు. చంద్రశేఖర్, ఈశ్వరయ్య, గంగయ్య మాట్లాడు తూ ప్రపంచ వ్యాప్తంగా ఐదుగురు బాలిక లలో ఒకరు బాల్య వివాహం చేసు కుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా బాల్య వివా హాలకు పేదరికం, సామాజిక ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, ప్రాంతీయ ఆచారా లు, నిరక్షరాస్యత వంటి పలు కారణాలు ఉండొచ్చన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయు లు , అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, దేవి, మునీశ్వరి, రాజేశ్వరి, విద్యార్థు లు పాల్గొన్నారు.

5న ర్యాలీని జయప్రదం చేయండి

భవన నిర్మాణ సంఘం నాయకుల పిలుపు

ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు డివిజన్ పరిసర ప్రాంతాల్లో ఇసుక పూర్తిగా నిలిపివేయడంతో భవన నిర్మాణ కార్మికులు సమస్యల పరిష్కారానికి ఈ నెల 5వ తేదీ నిర్వహించనున్న ర్యాలీని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో నాయకులు శుక్రవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపకులు పుట్టా శంకరయ్య మాట్లాడుతూ కార్మికులు ఇసుక పూర్తిగా నిలిపి వేయడంతో పనులు లేక పస్తువులతో గడుపుతున్నారని కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా ఇసుకను ఉచితంగా ఇస్తామన్న హామీని ఇంత వరకు ఈ ప్రాంతంలో అమలు చేయలేదన్నారు. సుదూర ప్రాంతాల నుండి ఇసుక అత్యవసరంగా కావాల్సి వస్తే దళారులు ఒక ట్రాక్టరుకు 6 వేలకు పైగా తీసుకుంటున్నారని తెలిపారు. గూడూరు డివిజన్ పరిధిలోని , కోట, వాకాడు, చిట్టమూరు, గూడలి, తూపిలిపాలెంలో ఉన్న రీచ్‌ల ద్వారా ప్రజలకు ఉచితంగా ఇసుకను అందుబాటులోకి తేవాలనికోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డుని పురురుద్ధరించాలని కోరారు. జీవో నెంబర్ 1214ను రద్దుచేసి పెండింగ్ క్లెయిమ్‌లను పునరుద్దరించాలని కోరారు. అర్హులను సంక్షేమ బోర్డులో రిజిస్టరు చేయాలని, గత ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులను బోర్డుకి జమ చేయాలన్నారు. ఈ నెల 5వ తేదీ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం నుండి ర్యాలీ ప్రదర్శనగా బయలుదేరి టవర్ క్లాక్ సెంటర్‌కు చేరి బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్మికులందరూ ఈ ర్యాలీ,ప్రదర్శనలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఎస్‌డి రఫీ, సీనియర్ నాయకులు గండికోట మధు, బండి కిష్టయ్య, సిఐటియు నాయకులు జోగి శివకుమార్, పి శ్రీనివాసులు, బివి రమణయ్య, అడపాల ప్రసాద్, పి సాయి పాల్గొన్నారు.

అనుమతిలేని పాఠశాలలను రద్దుచేయాలి

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: అనుమతి లేని పాఠశాలలను రద్దు చేయాలని కోరుతూ ఎంఈవో కార్యాలయం వద్ద, సిడిపిఒ కార్యాలయం ఎదుట సిఐటియు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్, సిఐటియు అంగన్‌వాడీ యూనియన్ పిచ్చాటూరు ప్రాజెక్టు కార్యదర్శి ఇంద్రాణి మాట్లాడుతూ పిచ్చాటూరు మండలంలో ఎలాంటి అనుమతులు లేకపోయినా సిఎస్ఐ వారు పాఠశాలలు నిర్వహిస్తున్నారని, ఈ పాఠశాలలకు విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ప్రలోభాలకు గురిచేసి తీసుకెళుతున్నారని విమర్శించారు. అంగన్‌వాడీ స్కూళ్లలోని చిన్న పిల్లలను వారి పాఠశాలలకు తీసుకెళ్లడం దారుణమన్నారు. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకపోయినా ఆ సంస్థ వారు విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని, భవిష్యత్తులో ఏదైనా జరిగితే తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే జోక్యం చేసుకొని అనుమతులు లేని పాఠశాలలను రద్దుచేసి, ప్రభుత్వ విద్యాసంస్థలైన అంగన్వాడీలను, ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థుల భవిష్యత్తుకు దారి చూపాలని కోరారు. అనంతరం ఎంఈఓ కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ అనుమతులు లేని పాఠశాలలకు నిర్వహించకూడదని వారికి తెలిపామని, ఇదే విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిక పంపుతామని తెలిపారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సిడిపిఓకి, ఎంపీడీవోకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అంగన్‌వాడీ యూనియన్ పిచ్చాటూరు ప్రాజెక్టు కార్యదర్శి ఇంద్రాణి, నాయకులు కృష్ణవేణి, శ్రీవాణి, ప్రమీల, భారతి, కళ్యాణి, అముదా, రూత్ మేరి, ప్రభావతి, శాంతి, చంద్రకళ, పాల్గొన్నారు.

ఎంసెట్ ర్యాంకు కార్డు రాక విద్యార్థి ఆందోళన

ఏడాది విద్యా సంవత్సరం నష్టపోయే అవకాశం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్:ఎంసెట్లో ర్యాంకు సాధించినప్పటికీ విద్యాశాఖ వారు ర్యాంకు కార్డు పంపకపోవడంతో ఏర్పేడు మండలంలోని ఓ విద్యార్థి ఆందోళన చెందుతున్నారు. విద్యాశాఖ వారు ర్యాంకు కార్డు పంపకపోతే ఏడాది పాటు విద్యాసంవత్సరం ఆ విద్యార్థి నష్టపోయే అవకాశం వుంది. ఏర్పేడు మండలం ఇసుకతాగేలి పంచాయతీ బీసీ కాలనీకి చెందిన మునిరెడ్డి, రాణి దంపతుల కుమారుడు పవన్ కళ్యాణ్ శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. 2024 కు సంబంధించి ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ ఎంట్రన్స్ టెస్ట్ (ఎంసెట్) పరీక్ష రాశాడు. ఈ పరీక్షను కాకినాడకు చెందిన జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ ఈ పరీక్షలో (ఎంసెట్లో) ఉత్తీర్ణత సాధించి 45,999 వ ర్యాంకును సాధించాడు. అయితే ఈ విద్యార్థికి విద్యాశాఖ ర్యాంకు కార్డును పంపాల్సి ఉంది. ఇప్పటికీ విద్యార్థికి ర్యాంకు కార్డు రాకపోవడంతో ఈ ఏడాది విద్యా సంవత్సరం నష్టపోయే అవకాశం ఉంది. దీంతో పవన్ కళ్యాణ్ అనే విద్యార్థి ఆందోళన చెందుతున్నాడు.. జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ కాకినాడ వారు ఈ విద్యార్థి మెయిల్ చేసిన ఫోన్ చేసినా స్పందించడం లేదని వాపోతున్నాడు. ఏపీ ఎంసెట్ వెబ్‌సైట్‌లో పరిశీలించగా నో రిజల్ట్ ఫండ్ అని చూపుతోందని చెబుతున్నాడు. ఏ ఇంజనీరింగ్ కళాశాలలో చేరాలన్న ర్యాంకు కార్డు ముఖ్యం. ఈ ర్యాంకు కార్డు పవన్ కళ్యాణ్‌కి అందకపోవడంతో విద్యార్థితో పాటు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యాశాఖ అధికారులతో పాటు కాకినాడ జేఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం స్పందించి త్వరితగతిన ర్యాంకు కార్డును పంపాలని కోరుతున్నాడు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుని సంబంధిత అధికారులకు తగు ఆదేశాలిచ్చి విద్యార్థి జీవితాన్ని కాపాడాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

విసికి బీసీ విద్యార్థి సంఘం అభినందనలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ అప్పారావును, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడును ఏపీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణ గౌడ్ మాట్లాడుతూ 70 సంవత్సరాలు చరిత్ర కలిగిన ఎస్వీయూ కు బీసీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ అప్పారావును ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, విద్యాశాఖ మంత్రి లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. జనాభా దామాషా ప్రకారం మిగతా పదవుల్లో కూడా సీనియర్ బీసీ ప్రొఫెసర్లకు అవకాశం కల్పించాలని కోరారు. వీరి వెంట బీసీ విద్యార్థి నాయకులు పవన్ కుమార్, నాగవర్ధన్, రమేష్ యాదవ్ ఉన్నారు.

సుప్రీం తీర్పుపై పలువురి హర్షం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఈ తీర్పు ద్వారా గిరిజన ఉపకులాల అణగారిన కులాలకు సమన్యాయం చేకూరుతుంది. ఆంధ్రప్రదేశ్ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇరువరం చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య,ఉద్యోగ విషయాల్లో మెరిట్ ఉన్న వారికి అన్ని కులాలల్లో వర్గీకరణ శాతం ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలపై సమగ్ర సర్వే చేసి ఆర్డినెస్ జారీ చేయాలని ఆయన కోరారు. ఎస్‌టిలో వెనుకపడిన కులాలు వారి జనాభా, ఆర్థిక, విద్యా, సంక్షేమ ప్రాథమిక ప్రమాణాలుగ పరిగణించాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం తక్షణం జీవో విడుదల చేయాలని, విధివిధానాలపై సిట్టింగ్ జడ్జి ద్వారా ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని, కోరారు.

7న ఘనంగా ఆలయ పునః నిర్మాణ కుంభాభిషేకం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రపురం(చంద్రగిరి): చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునః నిర్మాణ ఆలయ శిఖర ప్రతిష్ట, శతం చండి సహిత, సహస్ర కలస కుంబాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు అమ్మవారి పునః నూతన ఆలయ శిఖర ప్రతిష్ట, కుంబాభిషేకం నేపథ్యంలో శుక్రవారం అమ్మవారి ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే, ఆలయ నూతన కమిటీ సభ్యులు, ఆలయ మాజీ కమిటీ సభ్యులతో అన్ని శాఖల అధికారులు,స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుంభాభిషేక మహోత్సవ సమయంలో చేపట్టవలసిన వివిధ పనులకు దిశా నిర్దేశం చేశారు. అమ్మవారి మహా కుంభాభిషేకానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. చంద్రగిరి పంచాయతీ వారు చక్కటి పారిశుధ్యానికి, విద్యుత్ శాఖ అందమైన విద్యుత్ దీపాలంకరణకు, రెవెన్యూ చక్కటి క్యూ లైన్ ల ఏర్పాటుకు, పోలీస్ శాఖ వారు శాంతి భద్రతల పరిరక్షణకు, మండల పరిషత్ వారు తాగునీటి సౌకర్యం కల్పనకు కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి, ఆలయ పూజారి, నూతన కమిటీ సభ్యులు మాజీ కమిటీ సభ్యులు, మండల నాయకులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

శల్య వైద్యుడికి ఘన సన్మానం

డాక్టరు ఎస్ చంద్రశేఖర్‌రాజును సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరుకు చెందిన ప్రముఖ పుత్తూరు శల్య వైద్యులు, పారంపర్య వైద్య మహా సంఘం గౌరవ అధ్యక్షులు, గ్రీన్ క్రాస్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టరు ఎస్ చంద్రశేఖర్ రాజుకి ఘన సన్మానం చేశారు. పద్మశాలి నిత్య అన్నదానసత్రం యాదగిరిగుట్ట , భువనగిరి జిల్లా తెలంగాణలో మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సంప్రదాయ వైద్యుల సదస్సులో డాక్టర్ చంద్రశేఖర్ రాజుకు శాలువా కప్పి. పుష్పగుచ్ఛాలు అందించి సన్మానం చేశారు. ధన్వంతరి పంచలోహ విగ్రహంతో పాటు ప్రశంసా పత్రం అందించారు. గ్రీన్ క్రాస్ ట్రస్ట్ సంప్రదాయ విధానాలను అవలంబించే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు అవార్డు ప్రదానం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ జీవవైవిధ్య మండలి ఛైర్మన్, అమరావతి శైవ క్షేత్ర పీఠాధిపతులు శివస్వామీజీ, తెలంగాణ పారంపర్య వైద్య సంఘం అధ్యక్షులు యాత్రి మహారుషి , కార్యదర్శి ఆరూరి బాల నరసయ్య , గౌరవ అధ్యక్షులు సజ్జన రమేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'వైసిపి బాధితుల కష్టాలను పరిష్కరించుకోవాలి'

తిరుపతి (మంగళం) : రేణిగుంట రోడ్డులోని కాటన్‌మిల్లు వద్ద ఉన్న టిడిపి జిల్లా కార్యాలయంలో ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సాక్ష్యాధారాలతో సమస్యలను ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఊట్ల సురేందర్‌నాయుడు, కార్యదర్శి చేజర్ల మనోహర్ ఆచారి హామీ ఇచ్చారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి బాధితులు వరదల్లా వస్తున్నారని, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడానికే ఈ పరిష్కార వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న సమస్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని, ఇందుకు అధికారులు, కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు, పార్టీల శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం పిలుపు నిచ్చారు. పిచ్చాటూరు ఎంకేటి మహల్‌లో నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన ఎంపీడీఓలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బి, ఇరిగేషన్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, పశువైద్య, విద్యుత్, వ్యవసాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు ఉపయోగ పడే టి పి కోట రోడ్డు, దాసుకుప్పం బైపాస్ రోడ్డు, అరణీయార్, కాళంగి ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. అధికారులు, కూటమి ప్రభుత్వ స్థానిక నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. పిచ్చాటూరు మండల టిడిపి క్లస్టర్ ఇన్చార్జి ఇలంగోవన్ రెడ్డి, నారాయణవనం టిడిపి సీనియర్ నేత భాస్కర్, కెవిబి పురం, టిపి కోట, నాగలాపురం, బిఎన్ కండ్రిగ, వరదయ్యపాళెం మండలాల టిడిపి అధ్యక్షులు వివిధ సమస్యలు తెలిపారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈ ఈ మదన గోపాల్, ఎంపీడీఓలు, పంచాయతీ రాజ్, వివిధ శాఖ అధికారులు నాయకులు పాల్గొన్నారు.

ఐదు వందల నక్షత్ర తాబేళ్ల పట్టివేత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ లోని విజయవాడ బస్సులు ఆగు స్టేజి వద్ద శుక్రవారం తెల్లవారుజామున తిరుపతి అటవీశాఖ క్షేత్రాధికారికి అందిన రహస్య సమాచారంతో తనిఖీ చేయడానికి వెళ్లగా అక్రమంగా రవాణా చేస్తున్న 500 నక్షత్ర తాబేలను అధికారులు గుర్తించారు. తిరుపతి రేంజ్ ఎఫ్ఆర్ఓ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎఫ్ఎస్ఓ రవీంద్ర, ఎఫ్ బి ఓ సురేష్ బాబు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది తిరుపతి శ్రీ వెంకటేశ్వర బస్టాండులో తనిఖీలు చేసేందుకు వెళ్లగా ఆ సమయంలో అనుమానాస్పదంగా విజయవాడ బస్టాండ్ వద్ద కనిపించిన వ్యక్తులను ప్రశ్నించడానికి వారి వద్దకు వెళుతుండగా అటవీ శాఖ అధికారులను గమనించిన నక్షత్ర తాబేలు స్మగ్లర్లు వారి వెంట తెచ్చిన గోనె సంచులను వదిలి పారిపోయారన్నారు. వారు వదిలి వెళ్లిన సంచులను పరిశీలించగా అందులో 500 నక్షత్ర తాబేలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అక్రమంగా తరలింపులో పట్టుబడ్డ నక్షత్ర తాబేళ్లను మామండూరు అటవీప్రాంతంలో విడిచిపెట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రాణాలు అరచేతిలో విధుల నిర్వహణ!



ఊడిపడ్డ తహశీల్దారు కార్యాలయం పై కప్పు

ప్రజాశక్తి - ఓజిలి: కాలం చెల్లిన ప్రభుత్వ భవనాల్లో ప్రభుత్వ ఉద్యోగులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కాలం చెల్లిన భవనాల్లో విధులు నిర్వహణ ప్రమాదాలకు నిలయంగా మారుతు న్నాయని ఉద్యోగస్తులు వాపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఓజిలి మండల కేంద్రమైన తహశీల్దారు కార్యాలయంలోని తహశీల్దారు గదిలో హఠాత్తుగా పైపెచ్చులూడిపడి తోటి ఉద్యోగస్తులు భయభ్రాంతులకు గురి చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తహశీల్దారు నాంచారయ్య రెండు రోజుల క్రితం బదిలీ అవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న ఆర్డీవో చంద్రముణి కాలం చెల్లిన కార్యాలయ భవనంపై ఉన్నతాధి కారులకు నివేదికను పంపిస్తామని తెలిపారు.

ఎర్రచందనం స్వాధీనం.. స్మగ్లర్ అరెస్టు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: భాకరాపేట అటవీ శాఖ అధికారులకు అందిన రహస్య సమాచారం మేరకు గురువారం తలకోన నార్త్ బీట్ లో కూంబింగ్ నిర్వహించారు. ఈ కూంబింగ్ లో స్మగ్లర్లు ఎర్రచందనం కొయ్యలను మోసుకొని వస్తుండగా శాఖ సిబ్బందిని చూసి స్మగ్లర్లు ఎర్రచందనం కొయ్యలను కింద పడవేసి చెట్ల పొదలుగుండా పారిపోగా ఇద్దరు స్మగ్లర్లను వెంబడించి పట్టుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లు ఎర్రవారిపాలెం మండలం బోడెవాండ్లపల్లికి చెందిన నక్కా సుబ్రహ్మణ్యం రెడ్డి,తమ్మినేని మునిరత్నంలు గుర్తించి అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. పట్టుబడ్డ ఎర్రచందనం బరువు 160 కేజీలు ఉండగా వీటి విలువ సుమారు 4 లక్షలు ఉంటుందని అటవీశాఖ అధికారి దత్తాత్రేయ తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ బి ఓ లు రాజేష్ కుమార్,నిఖిల్, ప్రదీప్ చాంద్,శంకర్ ,డ్రైవర్ రోహిత్ బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు రహిత రాష్ట్రంగా ఏపీ

జిల్లా కుష్టు, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాస రెడ్డి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:కుష్టు రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేయాలని జిల్లా కుష్టు, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాస రెడ్డి జిల్లా వైద్యాధి కారులను ఆదేశించారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జులై18 వ తేదీ నుండి ఆగస్టు రెండవ తేదీ వరకు కుష్టు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి నమోదు చేసిన రికార్డులను డాక్టర్ శ్రీనివాస రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో అనుమానించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపిన అనుమానితులకందరికీ సక్రమంగా ఉచిత చికిత్స అందించాలని సూచించారు. ఆయా గ్రామాలలో ఇంకెవరికైనా కుష్టు లక్షణాలు వుంటే వారిని పరిశీలించి వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు ఉచిత చికిత్స అందించి కుష్టు రహిత రాష్ట్రంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ వెంకటరమణ, సిహెచ్ఓ మధుసూదన్ పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ విజయోత్సవ ర్యాలీ

విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం : ఎస్‌సి వర్గీకరణపై అనుకూలంగా సుప్రీంకోర్టులో తీర్పు రావడంతో ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పాలాభిషేకం చేసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మాదిగ సామాజిక వర్గాన్ని సుప్రీంకోర్టులో గెలిపించిన మందకృష్ణ మాదిగ ఎంఆర్‌పిఎస్ వెనుక ఉండి 30 సంవత్సరాలుగా పోరాడిన ఉద్యమకారులకు మండల దళితుల సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మందకృష్ణ మాదిగ పట్టు వదలకుండా బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడి వర్గీకరణ సాధించినందుకు కేంద్ర ప్రభుత్వానికి, సుప్రీం కోర్టుకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకి రుణపడి ఉంటామని ఎంఎస్‌పిఎస్ మండల అధ్యక్షులు పల్లిపాక నాగరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు ఓబులేసు, వంశి, హరీష్ , రమేషు, నాగార్జున, గిరి, రెడ్డప్ప పాల్గొన్నారు.

ట్రై సైకిళ్ల వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఐదుగురు ప్రత్యేక ప్రతిభా వంతులకు ట్రై సైకిళ్లు, మహిళకు కుట్టు మిషన్ అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మహిళలకు ఎమ్మెల్యే తన సొంత నిధులు పదివేలు రూపాయలు సహాయం అందించారు. గూడూరు టిడిపి కార్యాలయానికి ఎమ్మెల్యే సునీల్ కుమార్ శుక్రవారం విచ్చేశారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలోని పలు గ్రామాల ప్రజల వద్ద సమస్యలు స్వీకరించారు. తన మిత్రులు ఎల్ఎస్ ప్రాజెక్టు నిర్వాహకులు వాసు సహ కారంతో కొన్ని ట్రై సైకిల్స్ అందించి నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిమీ శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, చంద్ర, రహీం, పీట్ల నాగరాజు, సిద్దయ్యనాయుడు, భారతి పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు, చెట్లు తొలగింపు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పట్టణంలో స్థానిక పుత్తూరు హిందూ స్మశాన వాటిక ప్రధాన రోడ్డుకు ఇరువైపులా వున్న పిచ్చి మొక్కలు తొలగించే పనులు రోడ్డు స్వీపింగ్ పనులను మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎం రెడ్డి. శానిటరీ ఇన్స్పెక్టరు ఇంద్రసేన నాయుడు, కలసి శుక్రవారం ఉదయం పరిశీలించారు. పట్టణం లోని ఎంబి రోడ్ పక్కన నిర్వహిస్తున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. గేట్ పుత్తూరు బలిజ స్ట్రీట్‌లో చేపట్టిన స్పెషల్ శానిటేషన్ పనులను పరిశీలించారు. పట్టణం లోని విష్ణు థియేటర్ పక్కన వున్న ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతను పరిశీలించి రేపటిలోపు పూడ్చి వాహన చోదకులకు, పాదచారులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఏఈ కి ఆదేశాలు జారీచేశారు. పుత్తూరు జడ్జి రేపు వినాయకపురం ఎస్‌టి కాలనీలలో ఏర్పాటు చేయబోతున్న మెడికల్ క్యాంపు గుర్తించి వినాయకపురం కాలనీ వాసులకు రేపటి ఉచిత మెడికల్ క్యాంపు ప్రాముఖ్యత గురుంచి చెప్పి అందరు ఈ సదావకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని కాలనీ వాసులను కోరారు.

IN THE COURT OF ADDL JUNIOR CIVIL JUDGE-CUM-JUDICIAL FIRST CLASS MAGISTRATE, PUTTUR
O.S.No. 12/2024

BETWEEN
S.S.Giri ...**Plaintiff**
AND
Sandala Bhaskar ...**Defendant**

SUMMONS TO THE DEFENDANT

Sandala Bhaskar S/o S.Singaraiah residing at Door No.18-8-49/7 Maduranagar Thirupathi town & Post, Thirupathi Urban Mandal, Thirupathi Dist.

Please take summons that, the plaintiff filed the suit for recovery of debt basing on the mortgage deed in the above Hon'ble court against you and the above suit is posted to 30/08/2024 for your appearance. So, please to be attend on 30/08/2024 at 10-30 A.M. before the above Hon'ble court either in person or through your advocate, falling which the matter will be decided exparte against you on your absence.

This is the order of the above Hon'ble court.

N.MURUGESHAN REDDY
ADVOCATE PUTTUR